# మల్లాది వెంకట కృష్ణమూర్తి

అమలాపురం
16-2-1985

నా అభిమాన రచయిత ఆర్కే గారికి,

ఆంధ్రవీణలో సీరియల్‌గా వస్తున్న మీ నవల 'అటు నువ్వు-ఇటు నేను' చదువుతున్నాను. ఎంతో ఉత్కంఠతో సాగిపోతోంది. అవి తప్పకుండా రచనలు చదవనంటే నమ్మండి. ఇంతదాకా ఏ రచయితకీ నేను ఉత్తరాలు రాయలేదు. ఇదే మొదటిసారి. తప్పయితే క్షమించండి.

ఈమధ్య విడుదలయిన మీ నవల 'అరవై దీపాలు' కూడా చదివాను. అందులో ఇంజనీర్ పాత్ర చాలా బావుంది. నా గురించి నేను ఇక్కడ ఓ ప్రయివేట్ కంపెనీలో స్టెనోగా పనిచేస్తున్నాను. మా బావగారు రామచంద్రాపురంలో బి.హెచ్.ఇ.ఎల్.లో పనిచేస్తున్నారు. మా అక్క అక్కడే వుంది. మా చెల్లెలు ఇంటర్మీడియెట్ చదువుతోంది. మీ పుస్తకాలంటే దానికీ ఇష్టం. మా నాన్నగారు ఈమధ్యే కాలేజీ లెక్చరర్‌గా రిటైరయ్యారు.

మీరు బిజీ రచయితని తెలిసీ రిప్లై త్వరలో ఇమ్మని కోరుతున్నాను. మీ గురించిన వివరాలు తెలియచేయడానికి అభ్యంతరమా?

మీ అభిమాని
ప్రతిమ
హైద్రాబాద్
20-2-1985

డియర్ మిస్ ప్రతిమ,

16-2-85న మీరు రాసిన వుత్తరం అందింది. నా రచనల మీద మీరు చూపించిన అభిమానానికి కృతజ్ఞుణ్ణి. నేను కూడా ఇక్కడ ఓ ప్రయివేట్ కంపెనీలో స్టెనోగా పనిచేస్తూ, తీరిక సమయాల్లో రచనలు చేస్తుంటాను. పెళ్ళయింది. ఓ శ్రీమతి, ఇద్దరు పిల్లలు.

మీ
ఆర్కే
అమలాపురం
24-2-1985

శ్రీ ఆర్కే గారికి,

నిన్ననే మీ ఉత్తరం వచ్చింది. కొత్త రైటింగ్ ఎవరిదా అనుకుని తెరచి చూస్తే మీది. మీ చేతి వ్రాత బావుంటుంది-మీ రచనలలాగే. వెంటనే సమాధానం ఇచ్చినందుకు థాంక్స్. ఈ వారం మీ సీరియల్‌లో కొత్త మలుపు తిరిగింది. హీరోయిన్‌ని చివరికి ఏం చేస్తారో అనిపిస్తోంది. ఏం చేస్తారో నాకు రాయకండి. సస్పెన్స్ పోతోంది. మా హైద్రాబాద్‌లో రచయితలు ఎక్కువ




కదా? ఏ.జీ. ఆఫీసులో మీకు ఎవరైనా రచయితలు ఫ్రెండ్సున్నారా?

మీ
ప్రతిమ
హైద్రాబాద్
11-3-1985

ప్రతిమ గారికి,

నమస్తే,

మీ ఉత్తరం.

బిజీగా వుండి ఆలస్యంగా సమాధానం ఇస్తున్నాను. ఏ.జీ.ఆఫీసులో పనిచేసే వామనరావు నా ఫ్రెండ్. ఆయన సీరియల్ ప్రస్తుతం ఆంధ్రమాతలో సీరియల్‌గా వస్తోంది. నా కొత్త నవల కూడా అందులో త్వరలో మొదలవబోతుంది. ప్రస్తుతం వస్తున్న 'అటు నువ్వు...' సినిమా హక్కులు ఓ నిర్మాత కొన్నారు. ఆ పనిమీద మద్రాస్ వెళ్ళి రావడంవల్లే ఈ డిలే.

మీ
ఆర్కే
అమలాపురం
16-3-1985

డియర్ శ్రీ ఆర్కే,

కంగ్రాట్స్. మీ నవల సినిమాగా రాబోతోందని మా చెల్లెలికి చెప్పగానే ఎగిరి గంతేసింది. ఎవరెవరు ఏక్టర్స్? హీరోగా చిరంజీవినే వేయమనండి. మిగతావాళ్ళయితే బోర్. ఆ మాత్రం గట్టిగా చెప్పలేరా? షూటింగ్ ఎప్పుడు? చిన్న సహాయం చేయగలరా? మా నాన్నగారు రిటైరయినా ఇంకా పెన్షన్ రావడం లేదు. మీకు అభ్యంతరం లేకపోతే వామనరావుగారితో చెప్పి అదెంత వరకు వచ్చిందో తెలుసుకుని రాయగలరా? ఆయన ఆ ఆఫీసే కదా! రికమండేషన్ లేకపోతే అక్కడ పేపర్లు త్వరగా కదలవట. మీకు శ్రమ ఇస్తున్నందుకు మన్నించండి. ఇష్టం లేకపోతే చేయద్దు. ఏం అనుకోను. మీరే బిజీ అని నాకు తెలుసు. ఉత్తరాలు రాయటం మాత్రం ఆపకండి. మీ వూరు వచ్చే నెలలో వస్తే వస్తాను.

మీ
ప్రతిమ
హైద్రాబాద్
25-3-1985

డియర్ ప్రతిమ,

మీ ఉత్తరం అందింది. మీ నాన్నగారి కాగితాలు పంపిస్తే ఆ సహాయం చేసిపెడతాను. వామనరావుని నిన్ననే అడిగాను. సరే నన్నాడు. మీరు వచ్చే ముందు రాయండి. రామచంద్రాపురంలోనే వుంటారా? మీ చెల్లెలు కూడా వస్తుందా? ఆమెని అడిగానని చెప్పండి.

మీ
ఆర్కే
అమలాపురం
31-3-1985

డియర్ ఆర్కే,

థాంక్ యూ. థాంక్ యూ సో మచ్. ఫోటోస్టాట్ కాగితాలు జతచేస్తున్నాను. ఈ వారం ఆంధ్రమాతలో మీ సీరియల్ అనౌన్స్‌మెంట్ చూసాను. వన్స్ ఎగైన్ కంగ్రాట్స్. అదీ సినిమాకి పనికివచ్చేలా రాయండి. నవలలకి టైటిల్స్ పెట్టడంలో మీకు మీరే సాటి. నేను ఏప్రిల్ 26న వస్తున్నాను. భలేవారే. మిమ్మల్ని కలవకుండా, మీతో సినిమా చూడకుండా ఎలా వెళ్ళగలను? చెల్లెలు రావడంలేదు.

మీ
ప్రతిమ
హైద్రాబాద్
2-4-1985

డియర్ ప్రతిమ,

మీ ఉత్తరం అందింది. ఇవాళ ఆఫీసులో పర్మిషన్ తీసుకుని ఏ.జి. ఆఫీసుకి వెళ్ళాను. మీ నాన్నగారి కాగితాలు చూసే సెక్షన్‌లోనే వామనరావు పనిచేసేది. వాళ్ళ కాలేజీ నించి ఏవో కాగితాలు ఇంకా రాలేదట. ఆ లిస్ట్ జత చేస్తున్నాను. పంపించే ఏర్పాటు చేస్తే వెంటనే పెన్షన్ సేంక్షన్ అవుతుందిట. ఆల్ ది బెస్ట్. ఇక్కడ 'బ్లూ లాగూన్' అనే మంచి ఇంగ్లీష్ సినిమా ఆడుతోంది.

మీ

ఆర్కే

అమలాపురం

11-4-85

డియర్ శ్రీ ఆర్కే,

థాంక్స్ ఫర్ ఎర్లీ ఏక్షన్. మా చెల్లెలు నంబరు 478667. ఇంటర్‌మీడియెట్ ఎగ్జామ్స్ వ్రాసింది. వారం ముందు అక్కడ ఇంటర్‌మీడియెట్ బోర్డులో రిజల్ట్స్ తెలుస్తాయట. మీకు వీలుంటే కనుక్కొని చెప్ప గలరా? ఎక్కువ సహాయం పొందితే పాడయ్యేది స్నేహంట. మన విషయంలో అలా కాకూడదని కోరుకుంటున్నాను. ఈ ఇబ్బందికి మన్నించండి. అది తెగ చంపుతోంది మీకు రాయమని. అన్నట్లు నాతో అదీ వస్తోంది.

మీ

ప్రతిమ

హైద్రాబాద్

16-4-85

డియర్ ప్రతిమ,

మీ చెల్లాయ్ సెకండ్ క్లాస్‌లో పాసయింది. కంగ్రాట్స్. మంచి స్వీట్ పంపించండి.

మీ

ఆర్కే

హైద్రాబాద్

24-4-85

డియర్ ప్రతిమ,

16-4-85న నే రాసిన ఉత్తరం అందలేదా? మీ చెల్లెలు పాసయింది. మీ రెప్పుడు వస్తున్నారు? నన్నెలా కలుస్తారు? ఇది ఆఫీస్ లెటర్‌హెడ్. పై ఫోన్ నంబర్‌కి ఫోన్ చేసి నా పేరడిగితే నన్ను పిలుస్తారు. సమాధానం రాయండి.

మీ

ఆర్కే

హైద్రాబాద్

29-4-85

డియర్ ప్రతిమ,

పలుకే బంగారమాయెనా?

మీ

ఆర్కే

అమలాపురం

3-5-1985

డియర్ శ్రీ థమన్‌గారు,

ఆంధ్రవీణలో సీరియల్‌గా వస్తున్న మీ నవల చదువుతున్నాను. నా కెంతో నచ్చింది. మీవి తప్ప ఎవ రివీ చదవను అంటే నమ్మండి. ఇంతదాకా ఏ రచ యితకూ ఉత్తరాలు రాయలేదు. ఇదే మొదటిసారి. తప్పులుంటే క్షమించండి.

మీరు బిజీ రచయితని తెలిసీ మీ అభిమాన పాఠకు రాలిగా చిన్న ఇబ్బంది ఇస్తున్నాను. మా చెల్లెలు టైపింగ్ లోయర్ పరీక్షలకి హాజరయింది. దాని నెంబరు 3368. మీరు ఈ పరీక్షలు కండక్ట్ చేసే ఆఫీస్‌లోనే పనిచేస్తున్నారని మీ చిరునామాని బట్టి తెలుసుకున్నాను. దాని రిజల్ట్ గురించి నాకో కార్డు రాయగలరా? ప్లీజ్. అదీ మీ అభిమానే. తనకి సిగ్గని నన్నేరాయమంటోంది. మీరు బిజీ రచయితని తెలిసీ రిప్లై త్వరలో ఇస్తారని కోరుతున్నాను. మీ గురించిన వివరాలు తెలియచేయ డానికి అభ్యంతరమా? మీ నవల 'సగటు ఉద్యోగి' ఎంత నచ్చిందంటే దాన్ని కొన్నాను.

మీ అభిమాని

ప్రతిమ

